మన్మథహేలి

"కళాప్రపూర్ణ"

పండిత పెన్మెత్స సత్యనారాయణరాజు

C-I

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10529

A

పండిత పెన్మెత్స సత్యనారాయణరాజు

13

894.8271 VEN
A0VA104B138

ది 17–1–1971వ తేదీన వాల్తేరులో ఆంధ్రవిశ్వకళాపరిషత్తు నలుబది నాల్గవ పట్టప్రదానసభయందు "కళాప్రపూర్ణ" బిరుదము నొసంగు సందర్భమున శ్రీ పెన్మెత్స సత్యనారాయణరాజుగారినిగూర్చి పరిదధ్యక్షులసమక్షమున ఆచార్య కె. వి. ఆర్. నరసింహముగారు గావించిన ప్రఖ్యాపన ప్రసంగము.

అధ్యక్ష మహోదయా !

నవయుగ విద్వత్కవులలో పేరెన్నికగన్నవారును, కవిరాజ కవితా విశారదాద్యనేక బిరుద విరాజితులును, అగు, శ్రీ పెన్మెత్స సత్యనారాయణ రాజుగారిని, భవదాదేశానుసారముగ, ఈ స్నాతక పరిషన్ముఖమున పరిచయము గావించుచున్నాను.

శ్రీ సత్యనారాయణరాజుగారు, పశ్చిమగోదావరీ మండలాంతర్గతమగు వేడంగి గ్రామమున ది 20–12–1899 తేదీన జనించిరి. బాల్యమున స్వగ్రామమగు కాకరపఱ్ఱులోనే, విపశ్చిద్వరేణ్యులగు శ్రీ చెర్ల నారాయణశాస్త్రి కడ సంస్కృతాంధ్రముల నభ్యసించిరి. తరువాత, మద్రాసు విశ్వకళాపరిషత్తువారి విద్వాన్ పరీక్షయందు తీర్ణులై ఉపాధ్యాయవృత్తిని స్వీకరించి, ఆంగ్లోన్నత పాఠశాలలలో పెక్కింట పండితపదవి నలంకరించిరి. గుడివాడయందలి అంధ్ర కలందలో ఆంధ్రశాఖాధ్యక్షులుగ కొంతకాలము పనిచేసిరి.

శ్రీ సత్యనారాయణరాజుగారు బహుముఖ ప్రజ్ఞాసమన్వితులు. వీరు ఆంగ్లోన్నతపాఠశాలా పాఠ్యగ్రంథపరిషత్సభ్యులుగను, కేంద్రప్రభుత్వ యువజన విద్యాసంఘసభ్యులుగను, ఆంధ్రప్రదేశసాహిత్యఎకాడమీయందు కార్యవర్గసభ్యులుగను పనిచేసి, తమకుగల కార్యాచరణ దక్షతను శేముషీ విశేషమును ప్రదర్శించియున్నారు. ఆంధ్రప్రదేశ విద్యాశాఖవారును, కాంగ్రెసువారును వీరిని పెక్కువిధముల గౌరవించియున్నారు.

శ్రీ సత్యనారాయణరాజుగారు మహాకవులేకాదు గంభీరోపన్యాసకులుకూడ. మధురోజ్జ్వలమగు వీరి వాగ్విన్యాసముచే మార్మ్రోగిన సాంస్కృతిక సారస్వతవేదికలు పరశ్శతముగ గలవు. ఆంగ్లకళాశాలలయందును, ఆంధ్రవిశ్వవిద్యాలయమునందును, ఆకాశవాణియందును, వీరు పలుమారు లుపన్యసించి, వేలకొలదిగనున్న శ్రోతలకు వీనులవిందు గావించిరి. దినపత్రికలయందును, వారపత్రికలయందును, వీరు ప్రకటించిన సారస్వత వ్యాసములు సర్వజన శ్లాఘాపాత్రము లగుచున్నవి.

శ్రీ సత్యనారాయణరాజుగారు రాజకవులేకాదు కవిరాజులుకూడ, నిరర్గళధారాధోరణీభాసురములును, నిసర్గభావనా మహితములునగు, వీరి కైతలు సహృదయ సాహితీవేత్తల నిస్తులనిర్వ్యాజ ప్రశంసల నందుకొన్నవి. వీరి కవితాకళావైశారద్యమున కలరి, జయపురాధీశ్వరులగు శ్రీ విక్రమదేవ వర్మగారు వీరిని తమ ఆస్థానకవిగా నియమించి, సుందర మందిర సుక్షేత్ర ప్రదానాదుల బహుధా సత్కరించిరి. "చంపకమాలినీ పరిణయము" అను అచ్చతెనుఁగు కబ్బమున వీరు ప్రదర్శించిన పాండితీవైభవమున కచ్చెరువంది, గుడివాడయందలి పండితప్రకాండులు వీరికి "పండిత" బిరుదము నిచ్చి సమ్మానించిరి. శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు ఈ సుకవిశేఖరుల రచనలయందు గానవచ్చు తెలుఁగు నుడికారపుటింపుసొంపులను మెచ్చుకొని, వీరికి 'తెనుఁగురాజు' అను బిరుదము నిచ్చి గారవించిరి. శ్రీ విక్రమదేవవర్మగారి ఆధ్వర్యవమున జరిగిన వార్షికోత్సవ సభయందు ఆంధ్రభారతీతీర్థవారు వీరికి "కవితావిశారద" అను బిరుదము నొసంగిరి. శ్రీ వి. రామకృష్ణ, ఐ.సి.యస్. గారి జీవితచరిత్రమును, వీరొక ద్విపదప్రబంధముగా రచించి, జయపుర మహారాజులు శ్రీవిక్రమదేవవర్మగారి కంకితము గావించిరి. అక్కావ్యమునందీ కవిప్రకాండులు ప్రదర్శించిన కవితాకళామర్మజ్ఞతకును, పాండిత్యవైభవమునకును సంతసించి, శ్రీ విక్రమదేవప్రభువులు వీరికి కవిరాజ బిరుదము నొసంగి సమ్మానించిరి.

శ్రీ సత్యనారాయణరాజుగారు పద్యరచనయందే కాక, గద్యరచనయందును సిద్ధహస్తులు. సంస్కృతాంధ్రములందు సమాన ప్రజ్ఞతో కవిత చెప్పగల విద్వత్కవీంద్రులు. వీరు శతాధిక గ్రంథకర్తలు. అం దిప్పటి కరువది మాత్రమే ప్రకటింపఁబడియున్నవి. నవలలు, నాటకములు, శతకములు, ప్రబంధములు, ఖండకావ్యములు, బుఱ్ఱకథలు మున్నగు సాహితీ ప్రక్రియ లన్నియు నందు గానవచ్చును. వీరు బహుభాషా కోవిదులు. బహుశాస్త్ర నిష్ణాతులు. బహుగ్రంథ పరిశోధనదక్షులు.

హృద్యానవద్య కవితాకళా నిష్ణాతులును, బహుగ్రంథరచనా ధౌరేయులు నగు శ్రీ పెన్మెత్స సత్యనారాయణరాజుగారికి, "కళాప్రపూర్ణ" అను డాక్టరు బిరుదమును ప్రసాదింప విశ్వకళాపరిషదధ్యక్షుల సభ్యర్థించుచున్నాను.

శివాయ గురవే నమః

పరితోషము

శ్రీ జయపురాస్థానకవీంద్రులు, బహుకృతి రచయితలు, విద్వల్లోక బహూకృతులు, కళాప్రపూర్ణులు నయిన యీ పండితరాజకవిశేఖరులు నాకు చిరపరిచితులు, ఆప్తమిత్రులు. నేటి ఆంధ్రప్రదేశ సంస్కృతాంధ్రపండిత సమాజమున ముక్కాలుమువ్వీసము వీరి నెఱుంగనివారు లేరు. ఎఱిఁగిన వారిలో గౌరవింపనివారును కానరారు. ఆ గౌరవమునకు కారణ మున్నది- బాల్యమున ప్రాచీన సంప్రదాయానురోధముగా గురుకులవాసము గావించి పట్టుదలతో, అతిశ్రద్ధతో, అత్యాసక్తితో అధిగమించిన గీర్వాణభాషా వ్యాసంగనిష్ఠయు, తన్మూలకముగా సమార్జితమయిన భాషాపాటవమును పండితలోకాదరమునకు ప్రధాన కారణములు. మఱియు క్షత్రియులలో పండితులు అరుదుగా నుందురు. వారికి శ్రీదేవీసమారాధన మధికము. లక్ష్మి నెలకొన్న తావులకు సరస్వతి - అందును సంస్కృతాంధ్రసరస్వతి అంత చేరువగా చేరఁబడదు. ఏ కొలఁదిమందియో క్షత్రియపండితు లున్నను వారిలో కవితాప్రతిభ గలవారు మఱింత యరుదుగా నుందురు. అట్టి కొలఁదిమందిలో వీరివలె కవితాలతకు కోమలికము కూర్పఁగలిగినవారు లేరనుట సాహసమే మోగాని ఉన్నారని చూపుట మాత్రము సాధ్యముకాని కృత్యము. పూర్వరాజన్యులలో యుద్ధవీరులు, దానవీరులు, దయావీరులు అని యుండెడివారు. నేటివారిలో వీరు కవితావీరులు.

సహజమయిన ప్రతిభకు శ్రమించి సంపాదించిన వ్యుత్పత్తి సాయపడు చుండ ఆ ప్రతిభావ్యుత్పత్తులకు అనురూపమయిన అభ్యాసము అండయై నిలువ బహుముఖ సాహితీప్రక్రియలలో ముద్దులొలుకు రమ్యకృతులు పెక్కులు రచియించి కవితారసికుల కందించినవారు మన యీ కళాప్రపూర్ణులు. కవితాకామనీయకముతో పాటు వీరి సౌమ్యతా సౌకుమార్యము గూడ విశిష్టతకు పోషకమై సహృదయలోకమునకు ఆనందము కూర్చినది.

ఆ సహృదయానందమే వీరికి కవిపండితసమాజమున గౌరవము సంపాదించినది. అదే జయపురాస్థానకవి పదవిని అయాచితముగా అందించినది. అదే కళాప్రపూర్ణ బిరుదముతో వీరిని గౌరవింప ఆంధ్రవిశ్వవిద్యాలయము నుద్బోధించినది.

వీరి యీబిరుదమునకు ముచ్చట గొలుపు ప్రత్యేకత ఒకటి గలదు.—
ఆంధ్ర విశ్వకళాపరిషత్తు అవతరించినది మొదలు నేటి దాఁక జరిగిన స్నాతకోత్సవములు నలువది యాటింటిలో పరిషత్తుచే కళాప్రపూర్ణులుగా సంభావింపఁబడినవారు ఇప్పటికి ముప్పదిరైదుగురు. వారిలో ఒకరగు మన తెలుఁగురాజుగారికి ఆస్నాతకోత్సవ తరుణమున అభిజ్ఞులుపంపిన అభినందన లేఖలకు కృతజ్ఞతానివేదకముగా వీరుపంపిన పద్యమును పరికింపుడు.

"మీ శుభాకాంక్షలందెను మిత్రులార!
నా కృతజ్ఞతతోడి వినతులు కొనుఁడు
షోడశకలాప్రపూర్ణుఁడై సొబగుగూర్చు
రాజు మెచ్చకయుందురే రసికవరులు."

రాజు అనఁగా చంద్రుఁడుగదా! అతఁడు కళాప్రపూఁర్ణుడగుట సహజమేగదా! అట్టి పూర్ణచంద్రునిఁగాంచి ఆహ్లాదించుటకు మీలోనున్న రసికత్వమేకారణముగాని నాలో విశేషమేమున్నది? అని దీని భావము. వారు కంగ్రాచ్యులేషన్సు అంటే వీరు Thanks అనే మాదిరి కాకుండా రాజశబ్దార్థమును శ్లేషభంగితో చమత్కరించి, సారస్యముతో, వినయముతో, ఠీవితో హుందాగా ఇట్టి సమాధానము నుల్లేఖించు నవకాశము వీరికిఁదప్ప ఇతర కళాప్రపూర్ణులకు ఎవ్వరికిని కుదురుపడినదికాదు. నామధేయమున రాజ శబ్దముండఁగా ఇది కుదురుటలో విశేషమేమున్నది ? అందురేమో !

రాజ శబ్దముండఁగనే సరికాదు. ఆ శబ్ద ను ప్రకృతోచితముగా చమత్కరించు స్ఫూర్తి కలుగవలయును. ఉన్నవిశేషమంతయు ఆ స్ఫూర్తిలోనే యున్నది. ఇదేకాదు. రాజుగారి స్ఫూర్తులన్నియు సూక్ష్మములే.

సుకుమారములే. ఆ స్ఫూర్తిసౌకుమార్యమువల్లనే "మన్మథ హేల" రచనమును ఈ కృతిసమర్పణ సంవిధానమును సమకూరినవి.

మన పండితరాజుగారికి డెబ్బది దాఁటిన యీ పరిణతవయస్సున లోకప్రవృత్తిని ముచ్చటగా పరిశీలించుపట్ల ఏవేవో భావములు హేలగా స్ఫురించుట సహజము. లోకమున యువతీయువకులు మన్మథునిచేతిలో కీలుబొమ్మలగుట ప్రకృతిస్వభావము. ఆ బొమ్మలాటలందు రాజుగారు నేఁటి యువతీయువకుల మనోవికారపురీతులకు జాలిపడుచునో ముచ్చటపడుచునో తమకొదవిన స్ఫురణములను హృద్యమయిన పద్యములుగా రూపొందించి వానినొక మాలికగా సంతరించినారు. ఇవన్నియు దేనికదే సంపూర్ణ భావమాధుర్యముగల స్వతంత్రపద్యములు. పద్యములుకావు. రసగుళికలు. రసికులు వీని మాధుర్యము నాస్వాదించి మెచ్చుకోఁగలరు. రవంతయైన వివరింతమన్న మాధుర్యమన్నది మాటలకందునది కాదు. ఆస్వాదైకవేద్యము.

పండితరాజప్రతిభనుండి ఉదయించిన యీ కవితాకన్యాకుమారి ఎప్పటికైనా ఒక అయ్యచేతిలో పెట్టఁదగినదిగాని పుట్టినింటనే ఉండఁదగినది కాదు. అన్వేషింపగా నన్వేషింపగా వరుఁడు లభించినాఁడు. ఆ అయ్య బుల్లిఅయ్య. ఆ పేరు వినగానే ఈడుజోడు కుదురుపడుననియు ముద్దుముచ్చటలకు లోపముండదనియు సంబరముతో కన్యక గూడ తల యూపినది. సంతోషము. కాని యిపుడు ఈ కల్యాణమండపమున కృతికన్యకు వినఁబడకుండ జనాంతికముగా మీయందఱితో ఒక్కమాట. మనకుఁ దెలిసిన కొన్ని యంశములు వివాహసమయములందు బయలుపెట్టుట ధర్మము కాదు. అవి గోప్యములు.

నిజము చెప్పవలయునన్న ఈ వరుఁడు బుల్లి అయ్య కాదు. అది ఏనాఁడో పిన్నవయసున తల్లిదండ్రులు ముచ్చటగా పిలుచుకొన్న ముద్దుపేరు. ఇపుడీయన పెద్దఅయ్య. దేశమునందలి విద్యాధికులందఱుం గలిసి విద్యావిధానాధినేతగా వరించిన పెద్దఅయ్య. దేశమున ఉన్నతవిద్యావ్యాపనమునకును, ఉత్తమకళాపోషణమునకును ఎల్లవేళల పాటుపడుచున్న పెద్ద

అయ్యా. ప్రపంచమున క్షణే క్షణే మార్పుల నొందుచు ప్రకృతితత్త్వపరిశీలకములై నూతనవికాసము నందుచున్న వివిధములగు శాస్త్రముల స్వరూప స్వభావములను ఎప్పటికప్పుడాకళించుకొనుచు ఆ యా శాస్త్రముల నానా శాఖలలో ఆంధ్రయువకులు ఎప్పటికి ఎట్లు నిష్ణాతులగుదురా యని నిరంతరము తహతహ నొందుచున్న పెద్దఅయ్యా. విదేశవిఖ్యాతమయి పలువిధముల బాధ్యతలు గల సముద్రమంత విద్యాసంస్థను వినోదముగా వ్రేలికొనగోటిపయి నిలిపి హేలగా పరిరక్షించు పెత్తనము వహించిన పెద్దఅయ్యా. కృత్యాదిని కవిగారు భావించినట్లు విశ్వవిద్యాలయ భూతపూర్వ నేతలయిన రామలింగ, రాధాకృష్ణ. శ్రీకృష్ణ నారాయణ శ్రీనివాసుల సుగుణరేఖలను శక్తియుక్తులను తలపించుటకును మఱపించుటకును సమర్థతగల పెద్దఅయ్యా. సాధువర్తనులయిన సమర్థులకు అర్హతానుగుణముగా అనేకవిధముల నుపకృతులు గావించుటలో సువిశాల వివేచన శక్తి సంపద గల పెద్దఅయ్యా.

ఇంకను ఎన్నోవిధముల వరుఁడు ఎంతోపెద్ద అని తెలిసినచో బుల్లివరుఁ డనుకొనుచున్న కన్నియ నిరుత్సాహ యగునేమో! గప్‌చిప్! కల్యాణవేళయందు కన్నియకు ఉత్సాహభంగము కలిగించుట పాడిగాదు. వాస్తవికములయినను ఆ పెద్దతనము లెవ్వియు ఇపుడు తలపెట్టక ఎఱేఁగీ యెఱుఁగనట్లూరకుందము. ఈ సాంప్రదాయికసాలంకృతికన్యాదాన మహోత్సవమును వేడుకతో తిలకింతము.

సరేగాని- మిత్రమా! రాజాజీ! మిమ్ముమ ఇప్పట్టున ఒక్కమాట యడుగవలసియున్నది. పరోక్షమునఁగాక పదిమందిలో అడుగుచున్నందులకు క్షమింపుఁడు.

అయ్యకు పెండ్లి యగుచున్నదను సంబరమేగాని అమ్మకు సవతి యేర్పడునే యను సంకోచము మీకు కలుగలేదా? కలుగనక్కఱలేదా? ఇదేటి ధర్మము? ఆవశ్యకమగు సత్కార్యములందెల్ల అరుంధతివలె భర్తతో నిత్యసంయుక్తయై ఆ పతి గారాబమునకును మన్ననకును సంతసించుచున్న

సతీమణికి సంయుక్తాంబకు సవతిని గూర్చుట సమంజసమని మీా కెట్లు తోఁచినది.? న్యాయమేనా ?

అమ్మా ! కవులు తమకు తోఁచినంతెగాని పరులమాట చెవిని బెట్టరు. కద్దన్నను వద్దన్నను కవులతో పేచీలు పెక్కులు. కానిమ్ము. ఇంతమాత్ర మున మనసులో వైకల్యము నొందఁ బనిలేదు. ఈ కన్నియ తండ్రిని పోలిన ముద్దరాలు. సౌమ్యతామూర్తిగాని ధూర్తురాలుగాదు. ఇట్టి కన్యకామణు లెందఱు వచ్చినను నీకు వశవర్తినులై యుందురేగాని నిన్నెదుర్కొనువారు కాఁజాలరు - ఇట్టివారినందఱను నీలో సహజములయిన గాంభీర్యకౌశలము లతో నీవెంటఁ ద్రిప్పుకొనుచు ఆదరింపఁగలవు. అందఱము ఆనందింపఁ గలము.

మిత్రులారా ! ప్రకరణవశప్రసక్తములయిన మాటలు ఏవో నాలుగం టినేగాని కృతిని, .కృతికర్తను, కృతిభర్తను ప్రస్తుతము నేను ప్రత్యేకముగా ప్రశంసింపఁ బూనుకొనలేదు. అట్టి ప్రశంసలు అక్కఱయులేదు. ఆ వస్తువులు స్వయంప్రకాశములు.

వధూవరులకును బంధువర్గమునకును ఇవే నా శుభాకాంక్షలు.

—దువ్వూరి వేంకటరమణశాస్త్రి

★

వెలుఁగుబాట

తాను దనసతి రతితోనె తనియుచుండి
పరులఁ బరసతులన్ జేరఁ దఱుమునట్టి
మన్మథుని హేల బేలలౌ మనుజులకును
దెలుఁగురాజు నుడుల్ చూపు వెలుఁగుబాట.

౨

అన్ని రంగంబులందును నలరుబోండ్లు
యువకులును గూడిమాడు నీయుగమునందు
ఆత్మనియమావసరము వ్యంగ్యముగఁ దెల్పు
తెలుఁగురాజు నుడుల్ చూపు వెలుఁగుబాట.

3

వృద్ధులును యువకులఁబోలి వేషభాష
ణాదులం జేయుటెంతో హాస్యాస్పదమగు
మన్మథుని హేల యని వ్యంగ్యమహిమఁ దెల్పు
తెలుఁగురాజు నుడుల్ చూపు వెలుఁగుబాట.

౪

మహిని ధర్మావిరుద్ధకామంబు దివ్య
మనెడు కావ్యసందేశ మన్వర్థముగను
గృతికినాలంబు సంయుక్తపతిని జేయు
తెలుఁగురాజు నుడుల్ చూపు వెలుఁగుబాట.

కొవ్వూరు |
27-11-73 |

కే. వేం. నృ. అప్పారావు

పీఠిక

Prof: S. V. Jogarao, M.A., PH.D
Head, Dept. of Telugu, A. U. P. G. *centre*
PRESIDENT : GUNTUR DT. WRITERS' COOP SOCIETY
[FORMERLY PROFESSOR OF TELUGU, LENINGRAD
UNIVERSITY, U.S.S.R]

"పండితరాజ" బిరుదం ఇన్నాళ్లకు సార్థకం చేసుకున్నారు మా బావగారు- ఈ 'మన్మథహేల' మధురకావ్యం రచించి "భామినీ విలాసం" చిత్రగించి "ప్రౌఢమనోరమా కుచమర్దనం" చేసి రసగంగాధరుడై తేనేగాని పండితరాజు కాలేదాయన మరి అవేమీ చేయకుండానే హేలగా మన్మథుని అనంత విశ్వలీలా విలాసం సునిశితదృక్కుతో దర్శించి సురుచిర వాక్కుతో ఆవిష్కరించేసరికి పండితరాజులయ్యారీయన. పండితలక్షణాలలో పరేంగితజ్ఞత ఒకటి ముఖ్యమైనది. పరుల మనస్సులనేకాదు ఆ మనస్సులలో వీరమఠం వేసుకున్న మధురగంభీర మూర్తి మనోజమహారాజు ఎత్తిన అవతారాలను, వేసిన వాలకాలను అవగాహన చేసుకొన్నారు సత్యనారాయణరాజుగారు.

ఎవరయ్యా ఆ మన్మధుడు? ఎలావుంటాడు? వాడి ఎద్దడసేమిటి? అంటే- రసరాజు సౌందర్య విస్మృమరస్వాంతులైన రమానారాయణులతని తలిదండ్రులు. సకలచరాచర సృష్టి జ్యేష్ఠ భాత్రితట. రతిదేవి అతని హృదయ సామ్రాజ్ఞనేత్రి. తన శత్రువైన మహేశుని మాడునకెక్కి కూర్చుని మన మెప్పులందిన చందమామ మామట! సురుచిర సుమచార సురభిళ స్వాంతుడైన వసంతుడతని కమాత్యుడట! స్త్రీలు శిరసావహించే పూలతని బాణాలట స్త్రీలేకాదు ఏ దేవతలైనా తలయొగ్గవలసిందే ఆయన బాణాలకు. శుంకపిక చంచరీక శారిక లతని సిబ్బంది. రసిక సురధాణిగుండె వాని రాజధాని. ఇక చెప్పేదేముంది అతని ప్రభుత్వవైభవం. ఇంకా ఆయనగారెలాంటి వాడయ్యా అంటే. హరిహరాదుల కంటెగూడ అతిసనాథుడైన దైవత సార్వభౌముడుట అఖిల జీవుల కంతరాత్మ లోకంలో శంకరాదుల ఉనికినైనా శంకించే వారుంటారుగాని అజాత నాస్తికుడతడు. అజుడగ్రజుడై లేఅగు గాక

అతని సృష్టికాండ నాదేశించే ప్రభు వీయన. ఆ యా దేవుళ్లంతా కఠోరతపస్సులు చేస్తేకాని ప్రత్యక్షంకారు. ఈయనో అడక్కుండానే వచ్చి వరాలిచ్చి పోతాడు. ఈయనకు రూపం లేదంటారుగాని అసలెందుకు లేకుండా పోయిందో ఆలోచించిరు. లోకంలోని అందమంతా తన వొక్కడి వొంట్లోనే నిలవుండి పోవడం ఇష్టంలేక తన అంగమును నీడి అందమునంతా లోకానికి పంచి పెట్టేశాడు మహానుభావుడు. మహాభావుకుడు మా బావగారు మనసు విప్పితే అదోమధురభావాల ఆర్టుగేలరీ అందులో ఈ భావాలన్నీ వున్నాయి. ఆయన తలుచుకుంటే తన మనఃకెమేరాతో మన్మధుడికి ఫొటోలే తీయ్యగలరు. వా డెక్కడుంటాడంటే ఒకచోట వుంటాడు ఒక చోటఉండడుగనకనా. ఇందుగలడందులేడని సందేహము వలదు. అయినా ఎవరికేనా తెలుసుకోవాలని వుంటే మా బావగారి కేరాఫుకి వ్రాస్తేసరి అసలాయన దగ్గరనుండి సమాధానం రాకపోతే వొట్టు.

ఈ ముసలాయన కిప్పుడీ ముచ్చట్లేమిటనిపించవచ్చు మా బావగారిగురించి, అసలు ముసలితనంలోనే ముచ్చటైక్కువంటారు. అయినా మా బావగారు ముసలేమిటి! ఆయన తనువుకు వయసుమళ్లిందేమోకాని మనసుకి మళ్లలేదు. మనసులో మన్మథుడు మసలినంతకాలం ప్రతిమనిషీ నవయౌవనుడే. వాడు కన్నుమూశాడో కుర్రాడుకూడా ముసలికుర్రాడే,

ఈ కావ్యంరో మనోజ మహేంద్రజాలంపంటికాలంలో వివిధ వ్యక్తులలో వివిధ జీవితసన్నివేశాలలో అప్రభువు వేసిన వాలకాలెన్నో మనకు దర్శనమిస్తాయి. తచ్చిత్రణంలో ఈ రాజకవిశేఖరులు ప్రదర్శించిన నైపుణం ఆయన కవిరాజశేఖర ప్రతిష్ఠకు అతిమాత్రదోహదం చేస్తుంది. ఇందులోని పద్యాలలో ఒక నిసర్గమధురమైన శైలీలాలిత్యం, చమత్కార చారుత్వము, వ్యంగ్యవైభవం, వక్రోక్తిరక్తి–ఇన్నీ అతినాజూకుగా గోచరిస్తాయి. అయితే ఇందులో ఒక కథా కమామీషూ లేదు గదా ఈ పద్యాలు జీవిస్తాయా? అంటే ఎందుకు జీవించవూ? సప్తశతిలోని గాథలూ, శతకాల్లోని పద్యాలూ ఎన్ని జీవించడంలేదు? ఆ గాథలలో వున్న వ్యంగ్య వైభవానికి ముగ్ధుడై కదా ఆనందవర్ధనాచార్యుడు వాటిననేకం తన ధ్వని ప్రస్థానంలో పథపతాకలుగా స్వీకరించాడు అసలు వక్రోక్తి జీవితకారుడు వాగ్విదాంవరుడు కుంతకాచార్యుడేమన్నాడు :

“ నిరంతర రసోద్గారగర్భాః సౌందర్యనిర్భరాః
గిరః కవీనాం జీవంతి న కథా మాత్ర మాశ్రితాః ”

కథను మాత్రమే ఆశ్రయించిన కవుల వాక్కులన్నీ జీవించవు; రసపుష్టినీ సౌందర్య పుష్టినీ పొదువుకొన్న కవుల వాక్కులే జీవిస్తాయి అని అతని తాత్పర్యం. అయితే మరోకంత పూర్వాపరసంబంధనిరపేక్షములూ, ముక్తకప్రాయములూ అయిన ఈ పద్యాలలో రసజనక సామగ్రి ఎలా సజ్జీకృతమౌతుంది? రసోత్పత్తి కవకాశమేది? అని సప్తశతిగాథలకూ ఇదే ప్రశ్న వర్తిస్తుంది కాని రెండింటికీ సమాధానం ఒక్కటే వస్తుంది. ప్రాకృతంలో గాథా సప్తశతి నైకకవ్యుపజ్ఞము. సంస్కృతంలో గోవర్ధనాచార్య విరచితమైన ఆర్యాసప్తశతి ఏకైక కవ్యుపజ్ఞము. అలాంటిదే తెలుగులో తెలుగురాజకృతము "మన్మథమాల" ఈ రెండూ స్వభావతః సప్తశతి మానస పుత్రికలే. అయితే ఒక గూటిలోంచే వచ్చినా ఏ చిలక పలుకు పలుకు ఆ చిలకదే. అనిబద్ధశృంగారకావ్యాలు కావడమే ఆ అనుబంధం కాని రాజుగారి భావాలు ఏ యితర భావాలకూ (ఒకటి రెండు చోట్ల తప్ప) సుకుమార అనువాదాలు కావు. గతిమాలిన ప్రతిధ్వనులు కావు మరి? ఆయన అనుభవము పాదు నుండి పరిశీలనా పర్ణశాలము నుండి, సమాచారము ప్రాకారమునుండి, ఊహావిహాయసమునుండి బాహిరిల్లిన ప్రౌఢభావ బంధురములు, మృదుమధుర పదబంధసుందరములూ, స్వాతంత్ర్య కల్పనా కందరములు. "నకావ్యార్థ విరామోస్తి యదిస్యాత్ ప్రతిభాగుణః" అని కదా అన్నాడానందవర్ధనుడు, ఆ గాథలలోనూ, ఆర్యలలోనూ, ఈ రాజుగారి పద్యాలలోను పరిమితి స్వల్పమే అయినా ఎక్కడికక్కడ ఒక కథా సన్నివేశము కవి కౌశలవశమున సహృదయుని మనశ్చక్షువు ముందు సాక్షాత్కరిస్తుంది. కథాంశం క్రమంగా విస్ఫారితమై కాళ్లూ చేతులు తొడుగు కొంటుంది. మొదట స్ఫురిత ప్రసుప్త కల్పముగావున్న పాత్రల చరిత్రము స్థిరప్రస్ఫురణ వహిస్తుంది. అంతట రసపదార్థం రహిస్తుంది. అదే గాథలలోని మజా. రాజుగారి పద్యాల రహస్యం. అమరుక శ్లోకాల ఆంతర్యమూ అదే.

నవరసాల్లోను నవ్వుకు కారణమైన హాస్యమొక్కటే సువిశాల సృష్టిలోని సర్వజంతు సంతానంలోను ప్రత్యేకించి మానవుడికి మాత్రమే జన్మహక్కు అన్నట్లు భాసిల్లుతూవుంటే మానవోపజ్ఞమైన సాహిత్యజగత్తులో శృంగారమే రసరాజంగా పరిగణింపబడుతూ వుండడం పైకి ఆశ్చర్యంగానే కనిపిస్తుంది. కాని విశాల విశ్వసాహిత్యంలో సర్వేసర్వత్ర ఆదినుండి అద్యతనకాలం దాక ఉత్తమ

ములుగా పరిగణింపబడుతున్న సర్వకావ్యాలలోను శృంగారానికే రససార్వభౌమత్వం లభించింది. అందులో ప్రాయకంగా శృంగారసర్శలేని కావ్యమేలేదనవచ్చు. మరోచిత్రం—అంత ఆధిభౌతికవాసనా వశంవదమైన పాశ్చాత్య ప్రపంచంలో లేని ప్రాధాన్య ప్రతిపత్తి శృగారానికి ఆదినుండి ఆధ్యాత్మిక భావనకంకితమైన భారతదేశ వాఙ్మయాలలో కనబడుతూవుంది, "శృగారీ చేత్కవిః కావ్యే జాతం రసమయం జగత్" అని విశ్వసించే భావుకుడీ దేశంలో ఆనందవర్ధనుడి కింద లెక్క ఔను, శృంగారము రసరాజము "శృంగార ఏవమధురః। వర ప్రహ్లాదనోరసః" అని ఆనందవర్ధనుని వక్కాణ. శృంగారశూన్యమైన కావ్యము 'విరస' మైనదని రుద్రటుని తీర్మానము. సంగీతంలా ఆ పాతమధురము సర్వప్రాణి హృదయగోచరము, సద్యోహృద్యము సహృదయ నైవేద్యమూ అయినట్టిది శృంగారము. ఆ అనుభవం జీవితంలో అషడక్షీణమైనదైనా అందరూ ఎరిగినదే. కడమ రసాల అనుభవాలు జీవితంలో ఎవరికివారే ఏకైకంగా అనుభవించవచ్చు. కాని శృంగారానుభవమో ఉభయతారకమైనది. కడమ రసాల అనుభవాలను బహిరంగంగానూ పొందవచ్చును. శృంగారానుభమో ఏకాంతము ఏకాంతము అసలు సృష్టిమూలకము శృంగారకీలకం ఏ రసానందమైనా బ్రహ్మానంద సబ్రిహ్మచారేగాని విగళిత వేద్యాంతరత్వం, అనన్యపరతంత్రతత, హ్లాదైకమయత్వం మొదలైన బ్రహ్మానండ లక్షణాలు శృంగార రసానంద సందర్భానికి పట్టినట్లు మరే రససందర్భానికీ పట్టవు. ఆందుకే కాబోలు "శృంగార ఏవ ఏకోరసః" అని శృంగార ప్రకాశంలో భోజరాజు ప్రతిజ్ఞ.

వ్యాశృంగార రసికతా వికస్వర మానసుడైన మానిసి అవ్యయమైన హ్లాద మెద సాక్షిగ పొందడం మాత్రమే కాదు. ఆరసికత పెంపొందినకొద్దీ తనలోని సర్వవ్యసనాత్మకమైన పాశవ ప్రకృతిని చాసి భగవంతునితో భవ్యబాంధవ్యమేర్పడి తన తోడివారికి తానే ఒకదైవమవుతాడు అసలదీ శృంగారరస రహస్యం ఈ రస హస్యాన్ని కనిపెట్టి కళాకౌశలంతో ఈ "మన్మథహేల" మధురకావ్యాని రచించారు రసజ్ఞరాజశేఖరులు కళాప్రపూర్ణులు మా బావగారు ఆయన యినివరకు కావ్యకాంతతో బహువారములు సాహిత్య గోష్ఠులూ, సంగీతి గోష్ఠులూ మాత్రమే జరిపేరు ఇదిగో యిప్పుడే ఆమె కళాస్థానము లేవో కనిపెట్టి కంతుని మంతనాలాడు తున్నారు.

ఈ రాజకుమారికి శంతుని వంటి కాంతుడు లభించడం ముదావహం. శ్రీ బుల్లయ్య మహోదయులు ఆంధ్ర విశ్వకళాపరిషదుపాధ్యక్షులేకాదు సాంద్రకళా సౌందర్యస్వాదదక్షులు. ఒక విద్యాసామ్రాజ్య మహామాత్యులేకాదు సాహిత్యజగద్విహారవైయాత్యులు, రసజ్ఞ మన్మధులు. మహా మేధావి. మధుర మనస్వి. మాన్యవరగ్రహణమున మాబావగారి మనస్సృత యీకృతి కన్య దన్యాతి ధన్య.

“ తే పంద్యాస్తే మహాత్మానః
తేషాం లోకే స్థిరం యశః
యైర్నిబద్ధాని కావ్యాని
యేచ కావ్యే ప్రకీర్తితాః ॥”

అన్నారు పెద్దలు ఆ ఆర్యోక్తి యీశ్వశురజామాతలపట్ల అన్వర్థ మగుగాక!

గుంటూరు,
12-9-73.

యస్వీ. జోగారావు.



ఆంధ్రవిశ్వకళాపరిషదుపాధ్యక్షులు
శ్రీ ఎల్. బుల్లయ్యా సంయుక్త దంపతులు

కృతిసమర్పణము

శ్రీరాధా మధురాధరామృత రసార్ద్రీభూత దంతక్షత
స్మేరాంకూర కటాక్షవీక్షణకళా శ్రీమంతమైపొల్చు శృం
గారస్వామి యనుగ్రహించుతను మత్కావ్యాత్మజానల్లభున్
సారప్రజ్ఞాకలావిలాసుని రసజ్ఞ స్వామి శ్రీబుల్లయన్.

రామలింగారెడ్డి శేముషీవిభవంబు
సరస సంభాషణ చతురిమంబు
సుమతిరాధాకృష్ణ సూనృత తత్త్వాను
శీలనక్షమదృగ్విశిష్టతయును
శ్రీకృష్ణవిబుధుని స్నిగ్ధశీలత్వంబు
అభ్యుదయాధ్వ ప్రయాణబుద్ధి
నారాయణప్రాజ్ఞు నానార్థఘటనా ప
టీయః క్రియారమణీయశక్తి
శ్రీనివాస మనీషి మానిత విద్యాప్ర
మాణపరాయణ మానసంబు

ఇన్ని గుణముల యేకత్రసన్నివేశ
మై కలశవార్ధివలె నలరారు నీదు
వ్యక్తితను ఆంధ్రవిశ్వవిద్యాలయమున
కగును శ్రీరామరక్ష మహానుభావ!

వింటి మదీయకావ్యముల వీనులవిందుగ విన్న వెంట నీఁ
గంటి 'కళాప్రపూర్ణ' యనఁగాఁజను గౌరవపట్టమాదృతిన్
మంటి భవత్కటాక్షమున, మన్ననఁ దితి నాంధ్రభూమి, నీ
వంటి సఖుండు గల్గుటది భాగ్యము బుల్లయ! భానుతాళయా!

పతిభావ భావముల్ గతిముందె యూహించి
పరిచర్య చేసెడు పరమసాధ్వి
పతిదర్శనార్థమై వచ్చెడి వారికి
స్వాగతంబిడెడు పావనచరిత
పతికార్యదక్షత పరికించి యెన్నండు
విఱ్ఱవీగనియట్టి వినయమూర్తి
పతి చేయుచున్నట్టి పనులలో నెందును
వ్రేలుపెట్టని సువివేకశీల

యుక్త సాహిత్య సంయుక్త ప్రాక్త నార్య
సంప్రదాయానురక్త ప్రశస్త భక్త
లంకపల్లి సంయుక్త బుల్లయ్యపత్ని
సత్కలాపూర్ణ కృతికన్య సవతియయ్యె.

పుత్త్రున కుద్యోగం బిడి
పాత్రుండని ఛాయపఱచి పాలించిన నీ
మైత్రికి ఋణపడి యీ కృతి
పుత్రిని నీ కిడితి భక్తి బుధనుత ! కొనుమీ.

——

శ్రీ నడింపల్లి తిరుపతిరాజుగారు

కళాపోషక

శ్రీ నడింపల్లి తిరుపతిరాజుగారి ప్రశంస

మామ యటంచు నేఁ బిలుతు మాన్యుని తిర్పతిరాజుగారినిన్;
మే మొకనాఁడు కారుపయి మేలములాడుచు నేఁగుచుండఁగా
మామక కావ్యకన్యకను మన్మథహేలను బుల్లయాంకితం
బై మెఱయంగఁ జేతునన హర్షముచెంది "వివాహవైభవం
బేము స్వయంబుగా నెఱప నెంతుము కాదనకుండి మామగా
రూ! మనరాచరీవి కనురూపముగా జరిపింతు" మన్న నే
నేమియు మాఱుపల్కక సరేయని నవ్వుచు నూరకుంటె, మా
మామకు మన్మరాలగుట మామక కావ్యకుమారి, పెండ్లి కా
కామిత వస్తుజాతములు కానుకలిచ్చుట ధర్మమేకదా!

కృతజ్ఞత

తల్లి రాఘవాంబఁ దండ్రి వేంకటపతి
రాజు భక్తిఁదలఁచి ప్రాంజలించి
పోలనాయనమ్మ నీలమాంబకు మ్రొక్కి
కృతము దెలుపుకొందు నెల్లయపుడు 1

అనిశమ్ము చర్ల నారా
యణశాస్త్రి గురువరుని చరణాంబుజములకున్
వినయంబనయము తోఁపఁగ
పనివడి మ్రొక్కెదను నాదు భావమునందున్ 2

తొలుత నుద్యోగమున నన్ను నిలిపినట్టి
బండి శ్రీహరిరావును బ్రస్తుతించి
తక్కఁగల మిత్రవర్యులఁ దలఁపవలదె ?
మత్కృతజ్ఞత దెలుపఁగా మనసుదీర 3

బ్రతికియుండియుఁ జనియునా బ్రతుకు సాగఁ
గంటికిని రెప్పపోలికఁ గాచినట్టి
రామకృష్ణ ఐ.సీ. యన్నుఁ బ్రస్తుతింతు
దుర్గమాంబా ద్వితీయు మిత్రుని నుదారు. 4

తండ్రి పెట్టిన యొరవడి దాఁటకుండ
నన్ను నాత్మీయ గురువుగా నెన్నికొనుచు
రామకృష్ణ సుపుత్రిక, రామకృష్ణ
భార్య రాజేశ్వరి కనుటఁ బ్రస్తుతింతు. 5

నాదు జీవితచరితంబు నాదరమున
అంకితముగొని పూర్వార్ధమన్నిగతుల
గారవించిన మత్ పుత్ర కల్పుఁ ద్యాగి
అడుసుమిల్లి సుబ్రహ్మణ్యు నభినుతింతు 6

తనదు నాస్థాన కవిగ నన్ జనవుచేసి
వందయెకరాల భూమి మేడందగనిడి
శీవిగూర్చిన విక్రమ దేవవర్మ
జయపురపు మహారాజును సన్నుతింతు 7

మనమందు సత్యనారా
యణు వంగలకులజు ప్లీడరగు సన్మిత్రున్
నను గారవించు వానిని
దనివారఁగ బ్రస్తుతింతు దైనందినమున్ 8

3

అప్పు సప్పు నాక యడిగిన యర్థంబు
పద్దుపాయిదాయు వ్రాయకుండ
ఇచ్చి పుచ్చుకొనెడు హితుని మందరపు కా
మేశరావు మైత్రి నెంతు నెపుడు. 9

మన్మథహేల

ఓ రసాల! నీఫలముల నుబ్బిక్రోలు
పక్షి యొక్కటి నినుఁగూర్చి పాడుకొనదు
నీను లేఁజివుళ్ళనె తిని నీయశంబు
వెలయఁగాఁ జేయు కవి వనప్రియు మొకండె 1

పంచబాణ బాణపంచక రమణీయ
రాగయుక్తయయ్యెఁ బ్రణయచేష్ట
నవ వసంత భావ నాళీక మకరంద
మారఁ గ్రోల భ్రమరి యనుమతించె. 2

చిత్తజునిబోని గాజులసెట్టి యొకఁడు
రంగురంగుల గాజుల రమణి చేతి
కొక్కటొక్కటి తొడిగెను లెక్కయిడక
పైక మిడఁబోవ నది వాఁడు వలదనియెను ! 3

సంఖ్యలేని 'చెక్కు' సంతక మిడి బల్ల
మీఁదఁ బెట్టి సెట్టి మిణకరించె
వాని వాలకంబు పరికించి మదవతి
సున్న సుట్టి సెట్టి విన్నఁబోయె ! 4

"ఎయిరుకండిషన్ రూమదె యేగుదెమ్మ
పోయి కాఫీని గొందము హాయిగాను
నిర్మలాంగిరో !" యన నామె నెమ్మికాని
తెలివితక్కువ కెంతయో కలఁత చెందె. 5

"కొఱ్ఱుచేను పండెఁ గోడలిఁ బంపుమా !
"ప్రత్తిచేనో యింకఁ బండలేదు"
"ప్రత్తి విడుచుదాఁకఁ బంపవా ? యల్లుఁడు
కొంపఁదీయు నీవు కోపపడకు". 6

కొమ్మతోడ గట్టుగోరాడు నాఁబోతు
సోయగంబువంకఁ జూచి చూచి
వెడలి పలుపుమీఁదఁ బడవైచె మేనును
ముసలిమగఁడు బైట మూల్గుచుండె. 7

"చెలిమికాఁడ ! నేను స్వెట్టరు రగ్గును
విలిచి కొనఁగ నిపుడె వెడలువాఁడ"
"వెఱ్ఱిమొగమువాఁడ ! వెలఁదిఁ దీసుకరార !
పుట్టినింట నట్టెపెట్టకింక". 8

ఆ హసంతియొద్ద నల్లేల కూర్చుందు
పోయి పండుకొనర ! ప్రొద్దుపోయె
ముద్దరాలు భార్య నిద్దురలేకుండ
నీదు రాక వార్చి నిలిచియుండె. 9

లేడి యెఱచి తోడి వేఁడి యన్నంబును
"గుడిచి కూరుచోర !" కోడ లరుగు
దెంచు వేళయయ్యె, నించు రసము పాలు
పడకటింటియందుఁ బదిలపఱపు. 10

తాలవృంతము చేఁ బూని తాప ముడుగ
విసరుచున్నట్టు నటియించె వెలఁది మఱఁది
వాని వాలక మీక్షించి వామనేత్ర
పకపకలు పుట్టె తాళఁజాలక చెమర్చె. 11

ఒంటినిండఁ బసుపు నొడిలోనఁ బసిబిడ్డ
చంటినిండఁ బాలు సకియ చెంతఁ
గనులు మగనిపాలు, చనులు పాపనిపాలు
గునిసె నువిద భళిర ! తనిసె మగఁడు. 12

తిన్నయూరఁ దినక యున్నూరనుండక
'క్యాంపు'మీఁద మఱియు, 'క్యాంపు'వేయు
ప్రియునిమీఁది యలుకఁ బిల్లల బాదెడు
స్నుషను జూచి యత్త చోద్యమందె. 13

"వన్నెకాఁడ! నీకుఁ గన్నులు కలిగెనా?"
"కనులు గలుగఁబట్టి కంటి నిన్నుఁ
గన్నవారు నీకు నున్నారె? యున్నచో
విన్నవించు నీవు నన్నుఁగూర్చి". 14

గబ్బి గుబ్బలు త్రుళ్ళి తబ్బిబ్బులాడ
నలకలల్లాడఁ బైఁట చెంగల్ల జాఱఁ
జల్లఁ జిలికెడి చానతోఁ జనవరి యనె
"నీవు నేర్చిన విద్యయే నీరజాక్షి !". 15

అడ్డుదారి వచ్చి యాఁగకురా నన్ను
నత్తగారు గీమునందు లేరు
ఏగవలయు నేను వేగమే యింటికిఁ
జెలిమికాఁడ! యేమి చెప్పుమందు? 16

రైలు వెడలుచుండె రాత్రికాలము నందుఁ
బ్రక్కనున్న పడుచు చెక్కుఁ జెక్కు
తాఁకునట్లు తూఁగఁ దరుణవయస్కునిఁ
జెక్కుఁ దడుముకొనఁగఁజేసె నతివ. 17

పరువమబ్బి యుబ్బి పరువులు దీయఁగాఁ
దలఁపు లిటులు నటులు దారుచుండె
దేవళమున కేఁగి నైవేద్య మిడఁబోయి
యర్చకునకుఁ జేసె నారగింపు. 18

పద్మమందు వ్రాలి పద్మపత్రము తాఁకి
పద్మమధుపు నాని పద్మసదన
మందునన శయించు సుందర మధుపమా!
ధన్యమయ్యె నీదు తనువు జనియు. 19

పొన్నపూఁ జేతికందించి వన్నెలాఁడి
దాని సొబగును వర్ణింపఁబూన; నొక్క
ప్రోఢ దానిఁ గైకొని పొగడి ముద్దు
పెట్టుకొని నవ్వె నామె మేనట్టె కదలె. 20

భ్రమరరాజము పద్మరాజమున వ్రాలి
తేటతేనియఁ గ్రోలఁగాఁ దిపురుకొలఁది
తమ్మిపూబోఁడి తలయూఁపి తమి వహించె
సహజమేకద పద్మినీజాతి కద్ది 21

శీతవాతపోతములు ప్రాభాత వేళ
మందమందంబుగా వీవ మగనిచెంత
నెడమొగంబై పరుండిన పడఁతి మెల్ల
మెల్లఁగా వాని మెయిఁ గొనగోళ్ళ గీఱె. 22

మేను తడిసి జల్లువానను, జనుఁగవ
చీరనుండి పైకిఁ జెన్నుమీఱె
బట్టలుతుకు నామె బయకారమును జూచి
బాటసారి సొగసె, భర్త కనఁడు. 23

వలిపమగు చీర ధరియించి కొలనిలోన
మేనికాంతులు విరఁజిమ్మఁ దానమాడి
యొక విలాసిని రా నార్చె యువ కనులను
గొమ్మ వెంటనే తన జఘనమ్ము త్రిప్పె. 24

“చెఱకుముక్కఁ దింటెఁ జెలి! చూడు గంటులు
పెదవిమీఁద నెట్టు లొందవినవియొ”
యంచుఁ జూప నాథుఁ, డామె వెన్నను దెచ్చి
రుద్దఁబోవ నతఁడు దద్దరిల్లె. 25

సంజకెంజాయ లలమెడు సమయమాయె
సఖుఁడు తామరపూవులు సకియ కిచ్చె
వాని నటనుంచి కలువల వాని కొసఁగె
వత్తుఁ గ్రమ్మఱ ననిచెప్పి వాఁడు వెడలె. 26

చిలుకనోరికిఁ జక్కెర పలుకులంది
యిచ్చు చిలుకలకొలికి వచించు కలికి
పలుకులు వినుచు మైమర్చి నిలిచియున్న
ప్రియునిఁ గనుఁగొని పియురాలు ద్రిప్పెఁ గనులు. 27

“దోసపండుముక్క కోసి యిమ్మందు వే
రమణి! తెచ్చినాఁడ లంకనుండి”
“తీపి కలదయేనిఁ దినిచూతు లేకున్న
నెవరిదారి వార లేఁగవచ్చు”. 28

కుండలను వానుచుండిన కుమ్మరయ్య
హస్తమున వాని సరిచేయు చదముచుంట
నోరఁగంటను గనుఁగొను నువిద గుబ్బ
లొక్కమాఱుగ నపుడె పెల్లుబికి పోయె. 29

క్లాసులోనఁ జదువు కమనీయరూపునిఁ
గన్నులారఁగాంచి కన్నె యొకతె
యలరుఁదూపు మేన మొలచెనో యనునట్లు
పులకరించి మించి పలుకరించె 30

"ఏమిచదివినాఁడె? యేమిటినామంబు?
చెప్పుమమ్మ యేమితప్పు?" నాఁగ
దలను వంచుకొనియెఁ దరుణీలలామంబు
చెలిమికత్తెకేమి పలుకకుండ 31

పాడుచున్న గీతిఁ బతిపేరువచ్చుటఁ
బాడకుండఁగాంత 'పల్లకుండె'
నంతలోనె వచ్చి చెంతను నిలిచెను.
జెలువములను మించు చెలిమికాఁడు 32

నవ్వు మొగమున నరుదెంచి పువ్వులివిగో
దువ్వుకో తలఁ బెట్టుకో పువ్వులివ్వి
వెడలుదము సినీమాకన నొడయఁడపుడు
తళుకు బెళుకులచూపులఁ దరుణిఁగాంచె. 33

జడనుదాల్చిన మల్లెలు జాఱిపోయె
మెడనుదాల్చిన ముత్యాలుపడియె సెజ్జ
నెఱ్ఱఁబాఱిన నేత్రాల నెసక మెసఁగి
జాజితీవను బురుడించి శ్యామయొప్పె. 34

చీర సింగారమును జేసి కూరుచున్న
కాంతయొద్దకు నవ్వుచుఁ గాంతుఁడరిగి
యదిరిపాటున నానె బింబాధరంబు
మొగముచిట్లించెఁ జాలని ముద్దరాలు. 35

రామనామంబు వీణపై రాగయుక్త
ముగను బాడుచునుండఁగాఁ బూవుఁబోండ్లు
ఊర్పుగాలుల దీపంబు నూఁగఁజేయుఁ
బ్రేమ రేకెత్తగా మైథిలీమతల్లి. 36

చెయి మృదంగముమీఁదను జేర్చి చన్ను
లించుకించుక కంపింప మించుఁబోఁడి
యొసపరిగ నటించుచును నిట్టూర్పు పుచ్చె
సర్వభూషణ భూషితశ్యామలాంగి. 37

నొసటి నెలవంక కాంతులు దెసల నీన
ధగధగాయితమైనట్టి నగనుదాల్చి
విదియచంద్రుని భాతిగా వెలఁది పొలిచె
దాని సౌరును వీక్షించి ధవుఁడు దనిసె. 38

ముఖవారిజముతావి మూఁగినతేఁటి
న దలుప నది వ్రాలె నక్షుల, నల్ల
గలువలనుచు, మఱిఁ గసరెఁ జేయెత్తి
రాజీవమని కయి వ్రాలె, నగె సతి. 39

కెంపులింపుగ నెమ్మోవి నింపఁగఁ బ్రియుఁ
డద్దమందున వానిని నరసి యరసి
మురిసి ముద్దాడె రాచిల్క ముద్దులాఁడి
కలికిచూపులఁ బరికింప గడుసుమగఁడు. 40

'క్యాంపు' పోవ నెంచెఁ గాంతుఁడు, కా రాఁగ
వానిఁ బాయలేని భావ పద్మ
మనఁగఁ ద్రిప్పెఁ గాంత హ స్తపద్మంబును
గారు నాఁగ నతఁడుఁ గాంత నవ్వె. 41

షోకుగా హాటు బూటును సూటు వేసి
ఫేసుపౌడరు నద్దెడు ప్రియునిఁ జూడ
ఘర్మజలములు మెయినిండఁ గమ్మవై చెఁ
బ్రణయవారిధి యుబికిన భాతిగాను. 42

యువకు వాంఛను దీర్పని యువతి యతనిఁ
గాంచఁగాఁ జొచ్చె నరమోడ్పుఁ గనులతోడ
నొంటిమీఁదను జేయిడ నొల్ల నట్టి
పడతి పతి కౌఁగిలింతను బ్రస్తుతించు. 43

నిలువుటద్దము నెదుటను నిలిచి మొగము
పైని బొట్టు పెట్టుకొనెడు పడఁతిఁ జేరి
తిలకమును దిద్దు నెపమున వలపుకాఁడు
ముద్దులాడఁగఁ బులకించె ముద్దరాలు. 44

బావ వచ్చెనంచుఁ బరువెత్తెదేటికే
నీను రొట్టెవితెగి నేతఁబడియెఁ
బోయి నిమ్మరసము సీయవే చనవుతో
మేనయత్తకొడుకె మేకొలుపవె. 45

అడుగుపెట్టెనో లేదో గృహాంతరమునఁ
బ్రియుఁడు, ప్రియురాలిరవిక కంపించి ప్రిదిలెఁ
బ్రౌఢయగుతల్లి యదిచూచి ప్రక్కకొదిగెఁ
బ్రియుఁడుఁ, బ్రియురాలు 'గదిలోకి' వెడలినారు. 46

పనసతొనను దెచ్చి పతియీయఁ బడఁతికి
లజ్జ నామె దాని నుజ్జగించె
నంత మావిపండు నందీయఁగా నామె
రసముతీపి నతని రసనఁ దనిపె 47

ఇప్పకల్లును గైకొని తప్పత్రాగి
యొడలు తెలియక పడియుండె నొక్కచెంచు
అతని ప్రియురాలు ఓమ్మన నదిమె నతనిఁ
జెంచు కనువిప్పి ప్రియురాలి నంచు మెచ్చె. 48

"వానకారు వచ్చె వాఁగు పొంగునో యేమొ?"
"పొంగనిమ్ము నీకు బెంగయేల ?
నాన నడపుశక్తి నాకున్నదో బావ! "
యనఁగ నామె, యాతఁడరుసమొందె. 49

ఏటవాలుగ నాఁగక యేగుదెంచు
కొండవాఁగును బరికించి కోడెకత్తె
శిరముపంకించి గిఱ్ఱునఁ దిరిగి నెటకొ
వెఱ్ఱిమొగమిడి చూడఁగా విభుఁడు తన్ను. 50

మింట మబ్బు క్రమ్మెఁ గంట గ్రమ్మెను నీళ్ళు
మెఱపు తళుకుమనియె మిడికె నెడఁద
యుఱుము చెవులఁబడియె నురిసెను గుండెలు
ఉంగ్రమయ్యెఁ గడియ మువిద కపుడు. 51

ఓరి పెద్దవాఁడ! యోరంత ప్రొద్దును
ఊరువాడఁ దిరుగుచుందువేల ?
యత్తయింటి కేఁగి యాలినిఁ దెచ్చుకో
కాలుకుదురు నపుడు గల్లగాదు. 52

"ఉన్నమాటయన్న నులికెదవేలరా ?
యద్దమందుఁ గనుల నరసికోర !
యెఱ్ఱజీర లెట్టు లెసరేఁగుచున్నవో"
యన్న బొమ్మ, మనుమఁ డటమటించె. 53

"కుప్పనూర్పు నేఁడు కోడి కూయకముందె
తప్పకుండఁ బొలము తరలిరార !
మఱచిపోకుమోరి ! మాతండ్రి !" యనఁ గోడ
లలుకతోడ మామ నరయసాగె. 54

ఎన్నొరోజులుండె నెగ్గామిసేపను
ప్రక్క పఱచినాను పండుకొనుఁడు
మీకె చెప్పుచుంటి నూఁకొనరా లెండి"
యన్న సకియ నాతఁ డాదరించె. 55

రమణి రైలుదిగెను లైటులన్నియు నాఱేఁ
బెట్టెబేడ యామె వెదకుచుండె
నంతలోనె 'టార్చి' యాడించెనొక్కఁడుఁ
డిద్దఱకును జూపు లేకమయ్యె. 56

నీవు ముక్కుతోడ నెఱిచెడకుండఁగాఁ
బట్టుకొనిన మావిపండుగాదు
పండి పడ్డ తాటిపండురా! యియ్యది
కలికిపలుకు పలుకు చిలుకరాజ! 57

ముక్కుమీద ముక్కు తక్కకరాయుచు
టెక్క టెక్కరాయుచొక్క మొగిని
గూయు పావురముల కూఁతల నాలించి
నిలువు నీరుగాటె నెలఁత యొకతె. 58

కనులు కానరావె! కయిఁగయి రాసెదు
తొలఁగి పోవరాదె తొందరైన
నాఁడు తోడు నీకుఁ గూడనుండునుగదే
చదువకున్నె పాఠశాల నామె? 59

"మడిని గట్టుకొంటి మాటాడఁదీరను
ఆఁగుఁ డొక్కగంట యబ్బ! మీకె
చెప్పుచుంటి వినుఁడు చేయకతొందర"
యనెను ప్రోడమాట కలరె ధవుఁను. 60

ఏతమెక్కి త్రొక్కు నెలనాగ పిక్కల
పాటవంబు చూచు పంటకాఁపు
నీరుపోక మఱచి నిలుచుండియుండఁగాఁ
బాలికాఁపు వచ్చి పదరినాఁడు. 61

దక్షిణకర మెత్తి దాపలిభుజముపై
నున్న నీళ్ళకడవ నువిద యూఁదె
ఱైకనుండి తొంగి పైకిఁ జూచెఁ గుచంబు
బాటసారి నోట నూటయూరె. 62

గడ్డిమేటి వెనుక గలగల లాడఁగా
సైరికునకు నడుఁగు సాగదయ్యెఁ
గొంత ప్రొద్దుగడవఁ గోకలు దులుపుచుఁ
బడుచుజంట బయటఁ బడియె నగుచు. 63

రథముయాత్ర సాగె రద్దిగా జనముల
రాక పోక సాగెఁ బ్రముఖుఁ డొక్కఁ
డెదుర వచ్చు ముదిత ప్రిదిలెడు చనుఁగవ
తనదు ఱొమ్ముదాఁకఁ దారసిల్లె. 64

క్రొత్త చెప్పులేవొ గుమ్మముకడనుంట
కాంచి గేస్తు కాలు కదలదయ్యె
దొడ్డిదారినుండి తొంగి తొంగి కనుచుఁ
గోడెకాఁడు పెద్దదాడు దీసె. 65

"ఏమె యక్క! బావ నేప్రొద్దు దూషింతు
గంపెఁడంత సంతు గలదు" "కాకి
రెట్టవేయ గోడఁ బుట్టవా చెట్టులు
ప్రేమహేతువొక్క బిడ్డ లేదువ". 66

ఒడ్డెయుప్పరొక్కఁ డొయ్యారిభామకు
మట్టితట్ట యెత్తుపట్టునందు
ఓమ్మఓమ్మ తాఁకఁ జెమ్మటల్ చిగురొత్త
రిమ్మ యెచ్చిరిల్ల సొమ్మసిల్లె. 67

మండుటెండను దపియించి మనుజుఁడొకఁడు
దాహ మడుగంగఁ దొయ్యాలి ధారగాఁగ
నీరుపోయుచో దోసిలి జాఱవిడిచె
విడక నీరము లట్టులే యిడియె నామె. 68

తొలకరింపఁగానె పులకరించినయట్లు
కడిమిచెట్టు పూచెఁ గనుము సఖియ!
బంతులట్టులున్న వాసించు నాపూలఁ
గరములందుఁ దాల్చు ఘనులు ఘనులు. 69

వానలోన నానివచ్చు విలాసిని
కీయఁ జూచె గొడుగు మాయలాఁడు
వలదు పొమ్మటంచు వదలించెనాకాంత
మాయలాఁడు సిగ్గు మాటుకొనియె. 70

ఱెల్లుపూచె నదులు దెల్లఁబాఱెను బండు
వెన్నె లెల్ల కడల వెల్లి విరిసెఁ
బండి నేల కొరిగె వరిచేలు తోడి పూసెఁ
గాఁపు కన్నె, నవ్వె కాపుజాణ! 71

కన్నెలార! రండు వెన్నెల వత్తుల
నాడుకొందమనుచు నాడ యువతి
యరుగుమీఁద నున్న యౌవనవంతుఁడు
ఉలికిపడుచు నేల కుఱికినాఁడు. 72

Acc No. 10524

"అరయుమంబుజాక్షి ! హరిణంబు హరిణిని
గొమ్ముతోడ నల్లఁ గోఁకుచుండెఁ"
జారు వాక్కులింకఁ జాలింపుఁడని యామె
పంచదార తోడి పాలనిచ్చె. 73

ప్రొద్దు గ్రుంకుచుండెఁ బూఁబోఁడి ! చూడుము
తిలక మీవు నొసటఁ దీర్చినట్లు
ఇరులు గ్రమ్ముచుండెఁ గురులను దిద్దుకో
యనఁగ మగఁడు ముగుద గనిసి మురిసె. 74

ఉబ్బి తబ్బిబ్బులాడెడు గుబ్బచనులు
తళుకు బెళుకుల నీను చెక్కిళులు రెండు
చక్కఁదనమున కొక క్రొత్త చక్కఁదనము
గూర్చ చూలాలిఁ గని చొక్కెఁ గూర్మి ధవుఁడు. 75

సతులు పతులు గూడి జాతర చూడఁగా
నడుమ మిండకాండ్రు వడిగవచ్చి
మిండకత్తియలకు దండలుఁగొండని
యిచ్చి పుచ్చుకొనిరి మెచ్చులొలుక. 76

ఇరుగుపొరుగు నున్న యింతులు బిడ్డలు
చంట వెంటనంటి సందడింపఁ
బిక్చ రరయ నేఁగ విన్నాణి యొకనికి
దొడ్డివైపునఁ గల దిడ్డి చూపె. 77

రైలులోపలఁ గూర్చున్న ప్రాణనాథు
నోడిని దలయుంచి యాతని యొప్పా గనెడు
సతివ మోము నురోజముల్ హస్తపల్ల
వమున నతఁ డంటఁ జెమరించెఁ గమలనయన. 78

సంచి మఱచి వచ్చి యించుబోఁడి యొకత్తు
కొన్నసరకు పైటకొంగు పఱచి
వేయుమన్న సెట్టి వేయికన్నులఁ జూచె
మూటఁగట్టు నామె మోముఁ గనులు. 79

తావి చూడనట్టి పూవు, రంధ్రమిడని
రత్నహార ! స్రష్టప్రతిభ యనెడు
కవినిఁ గాంచి యొక్క కన్యాలలామంబు
కొప్పులోని పువ్వు రువ్వి చనియె. 80

బలుపు నెత్తుగలుగు పాలిండ్లయొద్దకు
దారిచూపునల్లు హారమడర
బాటనేగు నొక్కబోటిని రసికుండు
ఓరగంటఁ జూచి యూఁచెఁదలను. 81

కన్నులారఁగనదు కౌఁగిలీయఁగఁబోదు
పలుకరింప మాఱు పలుకఁబోదు
తియ్యనైన పెదవితేనె యానఁగనీదు
ముద్దరాలు పతికి ముద్దుదీఱ. 82

ఇటుకతట్ట నెత్తికెత్తగాఁ గుచయుగ్మ
ముబ్బి ఱొమ్ముతాఁక నుబ్బిపోయి
తాపిమేస్త్రి యామెఁ దనదండనుండఁగా
నాజ్ఞచేసె నామె యనుమతించె. 83

బలగమెంతొ చుట్టు బలసి యున్ననుగాని
నిన్ను వీడలేను నెలఁత మిన్న!
ఒంటెనిండ ముండులుండిన మాత్రాన
రసికుఁ డంటఁడొకో గులాబిపూవు! 84

అదిరి బెదరి దారి నరిగెడు గుబ్బెత
వీఁపునంటియున్న వేఁపయాకు
లరసి ప్రోడలోకరి యానన మొక్కరు
చూఁచి నవ్వ; నవ్వె సొగసులాఁడి. 85

ఒట్టు పెట్టుకొనకు ముత్తుత్తమాటల
బయటివలపులెల్ల బయటఁ బడియెఁ
జెంపల నెలవంక లింపులు గురిసెడు
నిలువుటద్దమందు నీవు గనుము. 86

రంగుమీసములను రంగైన కొనగోళ్ళ
దువ్వి దిద్దుకొనెడు దొరనుగాంచి
మొగము త్రిప్పుకొనుచుఁ బోయెడు దానిని
నరసి నవ్వసాగి రచటివారు 87

పంచదార వలదు పానకంబును వద్దు
ఏదియైనఁ బాట నీవుపాడు
మదియెనాడు మదికి నమృతంపుధారయై
తుష్టి పుష్టినిచ్చుఁదోయజాక్షి! 88

తొంగిచూతువేమి దూడలపాకలో
నంగనాచి! యచట గంగిగోవు
లేవి లేవు గంగ రావియొద్దను నవి
గలవు సుబ్బిగాఁడుఁ గలఁడు పోవె. 89

ఆరుబయట మంచమందుఁ బరుండిన
పురుషుఁడల్లె నిద్రపోవుచుండెఁ
జూచి చూచి చేయివైచిన బుగ్గపైఁ
గనులు దెఱచియతఁడు గదికిఁ జనియె. 90

ఇన్ని మల్లెపూలనేటికే కొన్నావు ?
మూఁడెవందలమ్మ ! పూవుఁబోఁడి !
ముడిచికొమ్మ వేగ ముడికొక్కయెత్తుగా
మూఁడుముళ్ళుపడక ముచ్చటేది ? 91

డ్రగ్గుహౌసు కొక్క డాక్టరు వచ్చి 'ని
రోధు' సంచికట్ట రొక్క మిచ్చి
కొనుట చూచుచున్న కోమలి నవ్వెను
రోవెలంది కాదురో వలంతి. 92

అత్త, యీఁడుపడుచు నటు నిటు చనఁగా నె
క్రొత్తకోడ లపుడు తత్తరమున
భర్తచెంత కేఁగి భావబంధురమైన
చూపు చూచి చొచ్చె సూన గృహము. 93

పచ్చిమొదలి దానఁ బనిమీఁద నున్నాను
తనయుఁ డిడుగో యెత్తికొనుము నాథ!
మురిసి ముద్దులాడి భుజముపైఁ బెట్టుకో
మీ ప్రయోజకత్వమే మహాత్మ! 94

పెండ్లి జరుగుచుండె పెరుమాళ్ళ సన్నిధి
గొండ్లి సలిపె నొకఁడు గొండ్లితోడ
నర్చకుండు చూచి యట్టె తీర్థము ద్రావెఁ
జోద్యమందినారు చూచువారు. 95

బిళ్ళమడత లిడుచు బిగియించి పంచెను
భూతి మొదలినిండఁ బూఁత పూసి
శిష్టమూర్తియైన శివభక్తుఁ డొకఁడు
చెలియ రాకఁ గోరి శివు జపించె. 96

"పయనమేడ కమ్మ! పరిణామ రమణీయ
మైన దివసమందుఁ జాన!" "చల్ల
గాలి వీచు జలధి వాలుకావేదుల
విశ్రమించి వత్తు విసిగియుంటి". 97

నేత్రవైద్యమునకు నెలఁత యొక్కతె వచ్చి
వెలికలగఁ బరుండెఁ బలకమీఁద
టార్చివేసి చూచి డాక్టరు మతిచెడెఁ
గనుచికిత్స యెవరికక్కఱగునో ? 98

సలుపుచుండు నెపుడు సరిగంగస్నానాలు
దూఱుచుండు నేల దొమ్మరిండ్ల
శాస్త్రి కేల యంత చదువన్న నతఁడనె
నెంత లెంత చదువు లంతవఱకె. 99

వధువు హరిజనసుత వరుఁడెన్న విప్రుండు
శిష్యురాలు నాక చేరఁదీసె
నీళ్ళుపోసికొనియె నెలలోనె యాపిల్ల
వాఁడు కోర్టుకెక్కె జోడువీడ. 100

సప్తసప్తికన్నఁ జందమామయె మాకు
నన్నివేళలందు నాప్తుఁడగును
చానముఖము చంద్రసఖమని కాదురా
మాకు నీకు నతఁడు మామవరుస. 101

కాఁడి తేలిపోయెఁ గంఠంబు బిగిసెను
ఒంటియెద్దు బండి యూఁగులాడె
"ఊరకోర బాబు! ఒళ్ళు బాగాలేదు"
అనెను నుడులుపైకి వినఁగఁ బడియె. 102

పంచబాణ వినుము పంచమస్థాయిలోఁ
బంచమంబు పాట సంచులెల్ల
పంచబాణములును బంకజముఖులకుఁ
దుష్టి పుష్టియిడుత మిష్టగతుల. 103

ప్రస్తరప్రాయ మీయూరు పాంథ! యిచట
సంస్తరము దుర్లభము సురేశ్వరునకైనఁ
జొప్పడు పయోధరము తీరుఁ జూడు చూచి
వెడలలేవేని సమయంబు వేచియుండు. 104

ఎందు కటు నిటు తిరిగెద విపుడు పాంథ !
మల్లికలును జాజులును తమాలములును
దట్టమైయున్న యీసరి త్తటము వంక
కేగు మది సేవ్య మిటువంటి యెండ వేళ. 105

28

13CI

A0UA104B138

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

BC

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA104B138
పుస్తకం పేరు	మన్మథహేల
తారీఖు	31 December 2025
ముందు అట్ట	YES
వెనుక అట్ట	YES
మొత్తం పేజీలు	59
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	bci , C.I A, 12
లేని పేజీలు	
తయారు చేసినది	
పేజీలు విడదీసినది	
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	anusha
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	

3, 17, 28, 13CI